# కథాకేళి



# ది స్టోరి ఆఫ్ ఎ స్మెల్లింగ్ రికార్డర్

## మల్లాది వెంకటకృష్ణమూర్తి

అమెరికన్ సైంటిస్ట్ రిచర్డ్ ఫాక్స్‌వెల్ అనేక చిన్న చిన్న పరికరాలని కనిపెట్టాడు. అతను విమానాలు తయారుచేసే కంపెనీలో సైంటిస్ట్‌గా పనిచేస్తూ విమాన ప్రయాణీకుల సౌకర్యం కోసం ఉపయోగించే అనేక చిన్న పరికరాలు కనిపెట్టాడు.

విమానంలో సినిమా చూపిస్తారు. ఓ పరిశోధకుడు కదలికలని ఫిలిం మీద బంధించే ప్రక్రియ కనిపెట్టబట్టే అది సాధ్యం అయింది. అలాగే పాటలని విని పిస్తారు. మరో పరిశోధకుడు శబ్దాన్ని బంధించే మేగ్నెటిక్ టేప్‌ని కనిపెట్టబట్టే అది సాధ్యం అయింది.

తను వాసనని బంధించి తిరిగి ప్రొడ్యూస్ చేసే ప్రక్రియని కనిపెట్టాలనుకున్నాడు రిచర్డ్ ఫాక్స్‌వెల్. కంటికి, చెవికి సంబంధించిన వాటితోపాటు ముక్కుకి సంబంధించిన జ్ఞానాన్నిచ్చే సువాసనలు బంధించే ప్రయోగాలు చేయసాగాడు.

శబ్ద తరంగాలని గాలి తీసుకెళ్ళినట్లే ముక్కుకి సువాసనని మోలెక్యూల్స్‌ని గాలి తీసుకు వెళుతుంది.

అనేక రకాలుగా రెండేళ్ళపాటు కృషి చేసాడు రిచర్డ్ ఫాక్స్‌వెల్. తన పరిశోధన ఓ దారిలో పడినట్లు, తను గమ్యానికి అట్టే దూరంలో లేనట్లు గ్రహించాడు రిచర్డ్. ఓ రోజతని భార్యకి చెప్పాడు తన పరిశోధనా వివరాలు.

"మా పరిశోధన విజయవంతం అయితే గ్రాహంబెల్, మార్కోనీలతో సమానంగా మాకూ ఖ్యాతి వస్తుంది" చెప్పిం దానిడ ఎంతో ఉత్సాహంగా.

రిచర్డ్ తన పరిశోధనని ఇంకాస్త తీవ్రం చేశాడు. అహర్నిశలు శ్రమపడి చివరికి గాల్లోని వాసనని పర్మనెంట్‌గా రికార్డ్ చేసే విధానాన్ని కనుగొన్నాడు. ఆ రాత్రి భార్యా భర్తలిద్దరూ షాంపేన్‌తో సెలబ్రేట్ చేసుకున్నారు ఆ విజయాన్ని.

"టేప్ రికార్డర్, వి.సి.ఆర్.లలా గృహోపయోగ పరికరంగా తీర్చి దిద్ద డానికి కొంత టైం పడుతుంది. తక్కువ ఖర్చుతో ఈ 'స్మెల్లింగ్ రికార్డర్'ని తయారీదారులు ఉత్పత్తి చేసే విధానం గురించి పరిశోధన చేయాలి" చెప్పాడు రిచర్డ్ ఫాక్స్‌వెల్.

"అదే మీరు చేయగలిగితే ఎంత బావుంటుంది! అప్పుడు సినిమా హాల్లో సినిమా చూస్తూ శబ్దం వినడమేకాక, ఆ దృశ్యంలోని వంటకాల లేదా పూల లేదా గుర్రపుశాల వాసనని కూడా ప్రేక్షకులు అనుభవించవచ్చు" చెప్పింది రిచర్డ్ ఫాక్స్‌వెల్ భార్య ఆనందంగా.

రిచర్డ్ ఫాక్స్‌వెల్ రోజూ తన భార్యకి తను పరిశోధనకి ఎంత దూరం వచ్చాడో చెప్పసాగాడు. ఆమె కోరిక మీద అతను ఓ 'స్మెల్లింగ్ రికార్డర్'ని ఇంట్లో భార్య కోసం అమర్చాడు. అతిథులెవరయినా ఇంటికి వచ్చినపుడల్లా రికార్డ్ చేసిన అనేక రకాల పూల వాసనలని ఆన్‌చేసి రిలీజ్ చేసేది. ఆ వాసన ఎలా వస్తోందో అర్థం అయేది కాదు.

"మీ పరిశోధన పూర్తయి ఈ 'స్మెల్ రికార్డర్'ని ఎవరయినా మార్కెట్లోకి విడుదల చేస్తే ఇక పెర్‌ఫ్యూమ్ కంపెనీలన్నీ పడుకుంటాయి" చెప్పింది రిచర్డ్‌తో అతని భార్య.

ఆ 'స్మెల్ రికార్డర్'ని ఒక్క సినిమాల్లోనే కాక ఇంకెలా ఉపయోగించవచ్చో రోజూ వాళ్ళిద్దరూ చర్చించుకునే వారు. అది ఎన్ని విధాలుగా ఉపయోగ పడుతుందో తెలుసుకునే కొద్దీ ఇద్దరికి ఎక్సయిటింగ్ వుండేది.

ఆ రోజుతో తన పరిశోధన పూర్తవుతుందని, వాసనని రికార్డ్ చేసే ఓ ప్రోటో టైప్ యంత్రం నమూనాని తను తయారు చేసానని చెప్పాడు రిచర్డ్ ఫాక్స్‌వెల్. మర్నాడు దాని పేటెంట్ తీసుకుని ప్రపంచానికి ఆ ప్రయోగం గురించి తెలియచేయాలనుకున్నారు.

ఆ రాత్రి రిచర్డ్ భార్య అతని కోసం ఎదురు చూసింది. రాత్రి పన్నెండయినా రాలేదు. ఎన్నిసార్లు ఫోన్ చేసినా అతని లేబరేటరీలో ఎవరూ ఫోన్ ఎత్తలేదు. రాత్రి ఒంటిగంటకి కారేసుకుని ఆమె అతని లేబరేటరీకి వెళ్ళింది. తలుపు లోపల తాళం వేసి లేదు. లైట్లు వెలుగుతున్నాయి. నిశ్శబ్దంగా వుంది లోపల.

భర్త గదిలోకి వెళ్ళగానే, బల్లమీద తల వాల్చుకొని నిద్ర పోతున్నట్లున్న ఆయన కనబడగానే దగ్గరకి వెళ్ళింది. అతనిలో ప్రాణం లేదని గ్రహించి పోలీసులకి ఫోన్ చేసింది. పోలీస్ డాక్టర్ వచ్చి పరీక్షించి విషవాయువు పీల్చడంతో మరణించాడని చెప్పాడు.

రిచర్డ్ ఫాక్స్‌వెల్ మరణానికి కారణం ఏదై వుంటుందో గ్రహించింది ఆమె. స్మెల్లింగ్ రికార్డర్! తన భర్త అజాగ్రత్త వల్ల పరికరం లేబరేటరీలోని విషవాయువుని దాన్నో రికార్డ్ చేసి వుంటుంది. ఆయనకి తెలీక అది ఆన్ చేసినపుడు తిరిగి ఆ విషవాయువుని రికార్డర్ వదిలి వుంటుంది.

పోలీసులు వెళ్ళాక ఆమె ఆ ప్రోటో టైప్ స్మెల్లింగ్ రికార్డర్‌ని గొడ్డలితో కొట్టి నాశనం చేసేసింది. దాని తాలూకు ఫార్ములాని తన భర్త కాగితాల్లో వెదికి తీసి కాల్చేసింది.

తన భర్త స్మెల్లింగ్ రికార్డర్‌ని కనుక్కున్న సంగతి ఎవరికీ చెప్పలేదు మిసెస్ రిచర్డ్ ఫాక్స్‌వెల్.



ఆంధ్రభూమి సచిత్ర వారపత్రిక 9-2-90